క్లుప్తంగా

వర్షాలు కురవాలని..


శివలింగాన్ని అభిషేకించిన గ్రామస్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వర్షాలు సమృద్ధిగా కురవాలని సోమవారం మండల పరిధిలోని గౌతాపూర్‌లోని హనుమాన్ ఆలయంలో శివ లింగానికి భక్తులు అభిషేకం చేశారు. గ్రామస్తులు బిందెలతో నీళ్ల తీసుకొచ్చి లింగాన్ని అభిషేకించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని లింగాన్ని అభిషేకిస్తే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని, దాంతో తాగు నీటికి, సాగు నీటికి ఇబ్బందులు ఉండవని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని తమ నమ్మకమని గ్రామస్తులు తెలిపారు.

హిందీ గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

వెల్దుర్తి(తూప్రాన్): కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ పోస్టు భర్తీకి గెస్ట్ టీచర్ నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్‌ఓ ఫాతిమా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఈడీతో కూడిన హిందీలో పట్టభద్రులు, హిందీ బోధనలో కనీసం ఒక సంవత్సరం అనుభవం కలిగి ఉండాలన్నారు. హిందీ భాషలో సమర్థవంతంగా మాట్లాడడం, రాయడం, చదవడం రావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీలోపు సంబంధిత ధ్రువపత్రాలతో కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఈపాస్ యంత్రాలకు కొత్త స్కానర్లు

చేగుంట(తూప్రాన్): రేషన్ పంపిణీ కోసం ఉపయోగించే ఈపాస్ యంత్రాలకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో కొత్త స్కానర్లను అమర్చారు. రెండు సంవత్సరాలకు పైగా ఈపాస్ యంత్రాలలో వేలిముద్రలకు సంబంధించిన స్కానర్ వాడగా.. ప్రస్తుతం వేలిముద్రల కోసం స్కానర్ల పనితీరు తగ్గిపోయింది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు ఈపాస్ యంత్రాలకు నూతన స్కానర్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చేగుంట, చిన్నశంకరంపేట మండలాలకు చెందిన రేషన్ డీలర్లు ఈపాస్ యంత్రాలలో వేలిముద్రల కోసం కొత్త స్కానర్లు వేయించుకోవడంతో పాటు యంత్రాల్లో సాంకేతిక సమస్యలు పరిష్కరించుకున్నారు.

విద్యార్థులకు మూల్యాంకన పుస్తకాలు

పాపన్నపేట(మెదక్): విద్యార్థులు మూల్యాంకన పుస్తకాలు సద్వినియోగం చేసుకోవాలని పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్ అన్నారు. సోమవారం తెలుగు టీచర్ మంగ నర్సింలు తన కుమార్తె సహస్ర పుట్టిన రోజును పురస్కరించుకొని విద్యార్థులకు మూల్యాంకన పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతు మూల్యాంకన పుస్తకాలు విద్యార్థికి అనేక విధాలుగా ఉపయోగపడుతాయని చెప్పారు.

అనాథ పిల్లలకు నోటు పుస్తకాలు పంపిణీ

తూప్రాన్: హార్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని బాలుర, బాలిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 32 మంది అనాథ విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు ట్రస్టు అధ్యక్షుడు మూడే రవినాయక్ తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

చేగుంట(తూప్రాన్): చేగుంటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మంగళవారం నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మిగిలిపోయిన మెకానికల్ ఇంజనీర్, ఎలక్ట్రిక్ ఇంజనీర్ సీట్లకు ఈనెల 11వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 63005 02568 నంబర్‌కు ఫోన్ చేయాలని ప్రిన్సిపాల్ కోరారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

తూప్రాన్: ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు యూఎస్‌పీసీ నాయకులు, రాష్ట్ర కౌన్సిలర్ రాజేంద్రప్రసాద్, సీనియర్ నాయకులు ముత్యాలుగౌడ్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పీఎస్బీ వాడకంపై అవగాహన

నర్సాపూర్ రూరల్: వరిపంట సాగులో పీఎస్బీ వాడకంపై మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు అవగాహన కల్పించారు. మండలంలోని అవంచలో ఈ కార్యక్రమం జరిగింది. వరి సాగు చేసే భూమిలో ఫాస్పరస్ సాల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా (పిఎస్బీ) ఉపయోగించే విధానంతో పాటు లాభాలను రైతులకు వివరించారు. రైతులు అధికంగా భాస్వరపు ఎరువులు వాడటం వల్ల భూమిలో నిల్వలు పెరుగుతాయని, సూక్ష్మ పోషకాల లోపాలు కూడా వస్తాయని రైతులకు వివరించారు.

నిధుల్లేక నిలిచిన పనులు

- ముందుకు సాగని పాఠశాలల అభివృద్ధి పనులు
- బిల్లులు రాక లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు
- మురుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థుల అవస్థలు


బాలుర ప్రాథమిక పాఠశాలలో మొండిగోడలకే పరిమితమైన మరుగుదొడ్ల నిర్మాణం


బాలికల జెడ్పీ పాఠశాలలో అర్ధంతరంగా నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణం

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం మారడంతో అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.మంజూరైన నిధులు విడుదల కాక పోవడం, చేసిన పనులకు బిల్లులు రాక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. అధికారులు, అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇది అల్లాదుర్గంలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో 'మన ఊరు–మన బడి'పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీ, డైనింగ్ హాలు, తాగు నీటి సౌకర్యం, ఇతర మరమ్మతు పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అల్లాదుర్గం ప్రాథమిక బాలుర పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగు నీటి సౌకర్యం, ప్రహరీ నిర్మాణం, కిచెన్‌షెడ్ పనులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ:18 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులు చేపట్టినా సక్రమంగా బిల్లులు రావడం లేదని పనులు నిలిపివేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు నిధులు రావనే ఉద్దేశంతో పనులు చేయకుండా వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం పనులు మొండిగోడలకే పరిమితమయ్యాయి. అల్లాదుర్గం బాలికల జెడ్పీ పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ:15 లక్షలు, పాఠశాలలో ఇతర మరమ్మతు పనులకు రూ: 8 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ డైనింగ్ హాలు పనులు చేపట్టినా బిల్లులు మంజూరు కాలేదు. దీంతో బిల్లు రావనే ఉద్దేశంతో పనులు అర్ధంతంతరంగా అపేసి వెళ్లిపోయినట్లు స్థానికులు చెప్పారు. ఈ పాఠశాలలో బాలురకు మూత్రశాలలు లేక ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ప్రవేశపెట్టింది. అయితే గత ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాలలను కాకుండా ఇతర పాఠశాలలకు నిధులు మంజూరు మంజూరు చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాలలు అప్పాజీపల్లి, నీలకంఠిపల్లి, వెంకట్‌రావ్‌పేట, సీతానగర్, అప్పాజీపల్లి తండా గ్రామాలలో నామమాత్రంగా పనులు చేసి నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పాఠశాలల అక్రమాలపై విచారణ చేపట్టాలని, అర్ధంతరంగా నిలిచిపోయిన పనులకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోడ్డు, కాల్వలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్ రూరల్: పట్టణంలోని 6వ వార్డులో ధ్వంసమైన రోడ్డుతో రాకపోకలకు ఇబ్బందులు అనే శీర్షికన జూలై 26న సాక్షిలో ప్రచురితమైన కథనానికి నర్సాపూర్ మున్సిపల్ అధికారులు స్పందించారు. 6వ వార్డులోని ఖాజీగల్లీకి వెళ్లే సిమెంట్ రోడ్డుతో పాటు మురికి కాల్వలకు మరమ్మతులు చేపట్టారు.


సిమెంటు రోడ్డు, కాల్వలకు మరమ్మతు చేపట్టిన దృశ్యం

సహజ ఎరువులతోనే అధిక దిగుబడులు

వ్యవసాయాధికారి రాంప్రసాద్


పతి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

టేక్మాల్(మెదక్): రైతులు పంటలు పండించేందుకు అత్యధికంగా సహజ ఎరువులు వాడితే అధిక దిగుబడులు పొందుతారని మండల వ్యవసాయాధికారి రాంప్రసాద్ తెలిపారు. టేక్మాల్ మండలంలోని కుసంగి గ్రామంలో పత్తి, వరి పంటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పత్తిలో అయితే పెను బంక,పచ్చ దోమ, తెల్ల దోమ వంటి పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వరిలో అయితే మొగి పురుగు రాకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు పంటల సాగు చేయాలన్నారు.

నానో యూరియాతో అధిక ప్రయోజనాలు

వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్


అవగాహన కల్పిస్తున్న ఏఓ రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు ఆధునిక సాంకేతిక పరి/జ్ఞానాన్ని అలవరుచుకోవాలని, తక్కువ పెట్టుబడితో, అధిక లాభాలు సంపాదించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్ అన్నారు. సాంకేతికతతో తయారు చేయబడిన ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా వాడకంతో అధిక ప్రమోజనాలు ఉంటాయని చెప్పారు. సోమవారం ఆయన మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామ రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానో యూరియా మొక్కలోకి నేరుగా వెళ్లడం వల్ల సానుకూల ప్రభావం చూపి, దిగుబడి అధికంగా వస్తుందన్నారు. రసాయన ఎరువులైన యూరియాను మోతాదుకు మించి వాడుతుండడంతో, నేల భూసారాన్ని కోల్పోవడంతో పాటు, రైతులకు ఖర్చులు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు తక్కువ లభించే నానో యూరియాతో మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, రైతులు బాల్‌రాజ్, యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని మల్యాపూర్ మీదుగా వెళ్లే రహదారిపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వంతెనకు ఇరువైపులా ఉన్న దిమ్మెలు కూలిపోయాయి. మండలంలోని మక్తభూపతిపూర్, శివ్వాయిపల్లి, తిమ్మానగర్ తదితర గ్రామాల నుంచి ప్రజలు మెదక్‌కు వస్తుంటారు. ఈ వంతెన మూలమలుపు వద్ద ఉండటంతో కొద్ది మేర అదుపుతప్పితే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం లేకపోలేదు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇది గమనించని వాహనాదారులు వాగులో పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వంతెన వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనాదారులు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న వంతెన

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరం


తల్లిపాల వారోత్సవం నిర్వహిస్తున్న టీచర్లు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సోమవారం చిన్నశంకరంపేటలోని ఒటకవ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణిలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణిలకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాలతి, జ్యోతి, నాగరాణి పాల్గొన్నారు.

ఎల్లుపేటలో..

టేక్మాల్ (మెదక్): మండలంలోని ఎల్లుపేటలోని అంగన్‌వాడీ టీచర్ సరిత ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని అవగాహన కల్పించారు. పోషకాహారమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇందులో సూపర్ వైజర్ శ్రీశైల, అంగన్‌వాడీ టీచర్ సరిత, కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

చేగుంటలో...

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమ వారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పుట్టిన పాపలకు ముర్రుపాలు పట్టడం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మృధుల, అంగన్‌వాడీ కార్యకర్తలు రేణుక, స్వర్ణలత, పద్మ, సుగుణ పాల్గొన్నారు.


తల్లిపాల ప్రముఖ్యత వివరిస్తున్న అనిల్‌కుమార్

ధర్మాసాగర్‌లో..

కౌడిపల్లి(నర్సాపూర్): ధర్మాసాగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ పద్మ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని చెప్పారు. ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు. అనంతరం అంగన్‌వాడీలో పంపిణీ చేసే పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశవర్కర్ మంజుల పాల్గొన్నారు.

మోడల్ ఇందిరమ్మ ఇల్లు


కౌడిపల్లిలో మోడల్ ఇందిరమ్మ ఇల్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో ప్రభుత్వం రూ.5 లక్షలతో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ఆకట్టుకుంటుంది. ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఇందిరమ్మ ఇంటిని నిర్మించింది. నిర్మాణం పూర్తవడంతో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులను మోడల్ ఇంటిని పరిశీలించాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కొసమెరుపు ఏమిటంటే గతంలో రూ 2లక్షలతో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటి పక్కనే నూతనంగా రూ 5లక్షలతో మోడల్ ఇందిరమ్మ ఇంటిని నిర్మించారు.

అదనపు గది నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు గది నిర్మాణానికి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కుమ్మరి బాలమణి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ టేక్మాల్ హైస్కూల్ అదనపు గది నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు రూ.13 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ సుజాత, పంచాయతీ రాజ్ డీఈ ప్రభాకర్, ఈఈ గోపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ కో ఆప్షన్ సభ్యుడు మజహర్, నాయకులు సాగర్, కిషోర్, అశోక్ రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం అజీజ్, ఉపాధ్యాయులు అమిరోద్దీన్, రమేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వర స్వామికి అభిషేకం

పాపన్నపేట(మెదక్): శ్రావణ సోమవారం పురస్కరించుకొని ఏడుపాయల్లోని దుర్గామల్లేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకం చేశారు. అర్చకులు పార్థివ శర్మ స్వామి వారికి పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి గుహలో వెలసిన మల్లేశ్వర స్వామికి శ్రావణ మాసంలో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది.


దుర్గా మల్లేశ్వర స్వామికి పూజలు

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా నర్సింలు


నియామక పత్రం అందిస్తున్న జిల్లా నాయకులు

చేగుంట(తూప్రాన్): విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా కరణం నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా నారాయణరెడ్డి, షబ్బీరున్నీసా, ప్రధాన కార్యదర్శిగా సూర్యప్రకాశ్, కోశాధికారిగా మహిపాల్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా చక్రపాణి, సభ్యులుగా సత్యనారాయణ, వీరమణి, రాజేశ్వర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రాములు, శ్యాంసుందర్, కుమార్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): కేంద్ర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలపై ప్రజలకు వివరించారు. రైతులకు, బడుగు బలహీన వర్గాలకు ప్రధాని నరేంద్రమోదీ అనేక పథకాలను అందిస్తున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శ్రావణ్, మాజీ అధ్యక్షుడు కోణం విఠల్, సంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు కృష్ణ, అనిల్, రాజు, సురేష్ తదితరులు ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి

శిథిల పాఠశాల సమస్య పరిష్కరించాలి

నర్సాపూర్: నర్సాపూర్‌లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం సమస్యను పరిష్కరించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ఎం.హేమలత సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం జడ్జి ఎదుట పలువురు విద్యా శాఖ అధికారులు సమావేశమయ్యారు. కాగా జడ్జి ఇటీవల శిథిలావస్థకు చేరిన స్థానిక మండల ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉందని, పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేవని స్థానిక జడ్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తికి నివేదిక పంపారు. ఈ నేపథ్యంలో ఎంఈఓ తారాసింగ్, పీఆర్ విభాగం అధికారులు అమరేందర్, మల్లేశం కోర్టులో జడ్జి హేమలతతో సమావేశమై పాఠశాలకు సంబధించిన పలు అంశాలు వివరించారు. కాగా, పాఠశాలకు కొత్త భవనం నిర్మాణానికి గతంలో రూ.కోటి మంజూరయ్యాయని వివరించారు. నిధులు ఉన్నందున పాఠశాలకు కొత్త భవనం నిర్మించి సమస్యను పరిష్కరించాలని జడ్జి హేమలత వారికి సూచించగా.. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తారాసింగ్ ఇతర అధికారులు చెప్పారు.

హాజరు నమోదులో జాగ్రత్తలు తప్పనిసరి

ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో అటెండెన్స్ నమోదు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పంచాయతీ కార్యదర్శులు డీఎస్ఆర్ (డైలీ శానిటేషన్ రిపోర్ట్)లో హాజరు నమోదు చేసే విషయంతో నిర్లక్షంగా ఇష్టమొచ్చిన ఫొటోలు పెడుతున్నారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. అన్ని గ్రామాలలో కార్యదర్శులు అందుబాటులో ఉండి పారిశుద్ధ్యం పనులు చేపట్టాలన్నారు. వనమహోత్సవంలో మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, ఏపీఓ పుణ్యదాస్ తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ శ్రీనివాస్

సంక్షిప్త వార్తలు

◆ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని చౌట్లపల్లిలో ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న చీమల చంద్రయ్య కుటుంబానికి లీలా స్వచ్ఛందం సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, నగదును అందజేశారు. సంస్థ చైర్మన్ డాక్టర్ మోహన్‌నాయక్, శ్రీనివాస్, శ్రీకాంత్, రాంచందర్‌రావు, రమేశ్, నర్సింలు, నారాయణ తదితరులు ఉన్నారు.

◆ ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని స్కూల్ తండాలో వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఏఈవో ప్రశాంత్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ పంట సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని, ఒక్కసారి నాటితే 25 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ డిప్యూటీ మేనేజర్ అశోక్ పాల్గొన్నారు.

◆ పలు వార్డుల్లో పర్యటన

నర్సాపూర్: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి పట్టణంలోని పలు వార్డులలో పర్యటించి ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, పార్టీ నాయకులు మల్లేష్, అంజిగౌడ్, హర్షవర్ధన్, శ్రీనివాస్‌గుప్తా, రవిందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

◆ రేషన్ కార్డుల పంపిణీ

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ముత్తాయికోటలో సోమవారం రెవెన్యూ శాఖ అధికారుల ఆధ్వర్యంలో రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం గిర్దావర్ ఆబేద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజలకు మంచి ఆహారం అందించాలనే ఉద్దేశంతో అర్హత కలిగిన వారందరికి ఒక్కరికి ఆరు కిలోల చొప్పున మూడు నెలలకు సరిపడా సన్నబియ్యంను సరఫరా చేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ హేమంత్, వంశీ, స్వామి, వెంకటేశం, వెంకటేశం, భూమేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

◆ ఆలయాలలో భక్తుల పూజలు

పెద్దశంకరంపేట(మెదక్): శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఆలయాలలో భక్తుల సందడి నెలకొంది. సోమవారం మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయం, గొట్టిముక్కుల శివాలయం, గురుపాదగుట్ట శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ అధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

◆ మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

పెద్దశంకరంపేట(మెదక్): మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకిర్‌అలీ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేట నుంచి ఉత్తులూర్ వెళ్లే దారిలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడే బాధ్యత అందరిదన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ సంతోష్‌కుమార్, ఈసీ నవాజుద్దీన్, గ్రామకార్యదర్శి వెంకటరాములు, టీఏ మోహన్ తదితరులు ఉన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న హిందీ, సోషల్ సీఆర్‌టీ పోస్టులకు దరఖాస్తులు అందించాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ గీతా కోరారు. ఈ నెల 5, 6వ తేదీలలో దరఖాస్తులను అందించాలని సూచించారు. హిందీ, సోషల్ ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించినవారు సంప్రదించాలని కోరారు. అలాగే చిన్నశంకరంపేటలో నిర్వహిస్తున్న హవేళిఘనపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో గణితం బోధించేందుకు టెట్ అర్హత పొందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గీతా తెలిపారు. అర్హతగల అభ్యర్థులు నేరుగా తమ దరఖాస్తులతో ఈ నెల 5న పాఠశాల సమయంలో సంప్రదించాలని కోరారు.